

# ఆనంద నిలయము



శ్రీ జూలకంటి
బాలసుబ్రహ్మణ్యం

తిరుమల క్షేత్రం ప్రపంచ ప్రసిద్ధి చెందిన పుణ్య స్థలం. ఈ దివ్య స్థలంలో వెలసివున్న స్వామి శ్రీ వేంకటేశ్వరుడు. ఈ స్వామివారిని దర్శించడానికి నిరంతరం ప్రపంచం నలువమూలలనుంచీ భక్తులు వస్తూ వుంటారు. రావడమే కాదు. ఆ భక్తులందరూ ఆ భగవంతుని భక్తిగా, ఆర్తిగా, ఆర్ద్రంగా, ఆనందంగా ఏడుకొండలవాడని, తిరుమలేశుడని, శ్రీనివాసుడనీ, అడుగడుగు దండాలవాడని, ఆపదమొక్కులవాడని, కోరిన వరాలరాయుడని, వడ్డికాసులవాడని....... ఇలా ఎన్నో పేర్లతో పిలుస్తుంటారు. ఎన్నో మొక్కుబళ్లు చెల్లిస్తుంటారు. ఎన్నో నైవేద్యాలు సమర్పిస్తారు. ఉత్సవాలు కూడ చేయిస్తారు.

ఇలాగ ఎన్నో విధాల, మరెన్నో విధాల తనను మనసా వాచా కర్మణా సేవించి తరిస్తున్న భక్తులకు ఆ స్వామి అత్యంత సులభుడై వారి వారి కోరికలు ఇట్టే తీరుస్తున్నాడు. ఆ తిరుమలేశుడు ఎందరికో కాళ్లు ఇచ్చాడు. ఎందరికో కన్నులిచ్చాడు. మరెందరికో కడుపును నింపాడు. ఇంకెందరికో కడుపును పండించాడు. ఎందరికో మాట లిచ్చాడు. కొందరికైతే మాట నిలబెట్టాడు. ఈ కోరికలు తీర్చడంలో ఏ మాత్రం పక్షపాతం చూపించడు. చిన్నా పెద్దా తేడా లేదు. ఆడా మగాతారతమ్యం లేదు. కుంటి, గుడ్డి, చెవిటీ, మూగా అన్న ఈసడింపూ ఇసుమంతైనా లేదు. కుల, మత, వర్గ, వర్ణ, విచక్షణ అసలే లేదు. భాషా బేధం అంతకన్నా లేదు. ఇంతటి భక్తప్రియుడైన ఆ కొండలరాయుడు ఎక్కడినుండి వచ్చాడు? ఎప్పుడు వచ్చాడు? అసలు ఆ స్వామివారి చరిత్ర ఏమిటి? స్వామివారు రాకముందు ఇక్కడ ఎవరైన వున్నారా?...... ఇలాంటి ప్రశ్న పరంపరలకు సందేహాలకు సమాధానమే ఈ ''ఆనంద నిలయం'' ధారావాహికం. చదవండి! చదవించండి! ఆనందించండి!!

**గోవిందా! గోవిందా! గోవింద!!**

పూర్వం ఒకానొకప్పుడు నైమిశారణ్యంలో శౌనకాది మహామునులు అందరూ చేరారు. పవిత్రమైన ఆ దివ్య భూమిలో, మానవులందరికీ యీతి బాధలన్నీ తొలగాలనీ, సుఖ శాంతులు వర్ధిల్లాలనీ కోరుతూ తద్వారా జగత్కల్యాణాన్ని అభిలషిస్తూ, ఆ మహర్షులందరూ పన్నెండేళ్లపాటు సుదీర్ఘంగా కొనసాగే 'సత్రయాగం' అనే మహా యజ్ఞాన్ని ప్రారంభించారు. ప్రతి రోజూ యాగానంతరం విరామవేళల్లో, వేదవ్యాస మునీంద్రుల ప్రియశిష్యుడైన సూతుడనే మహనీయుని చేత, పురాణాలు, పుణ్య కథలు, తీర్థ విశేషాలు, క్షేత్ర మాహాత్మ్యాలు వింటూ సత్కాలక్షేపం చేస్తూండేవారు.

ఆ మహర్షులు ఒకనాడు సూతునితో ఇలా అన్నారు.

**ధారావాహికం – 1**

''సూత మహాశయా! నీవు చెప్పే కథలు చాల ఇంపుగాను ఉన్నాయి. ఆసక్తిని కలిగించేవిగాను ఉన్నాయి. ప్రస్తుతం మాకు ఒక సందేహం కలుగుతూ వుంది.

అదేమిటంటే శ్రీమన్నారాయణుడు సాక్షాత్తుగా ఈ భూలోకంలో నూట ఎనిమిది దివ్య స్థలాలల్లో వెలసి వుంటూ ఆరాధింపబడుతున్నాడని చెప్పబడు తున్నది. ఆ దివ్య ప్రదేశాలన్నీ ''దివ్య తిరుపతులు'' గా పేరు పొంది

వున్నాయి కదా. మరి వాటిల్లో శ్రీరంగం, శ్రీముష్ణం, తోతాద్రి, సాలగ్రామం, నైమిశారణ్యం, బదరికాశ్రమం, కాంచీపురం, వేంకటాచలం అనే ఈ ఎనిమిది పుణ్య క్షేత్రాల్లో శ్రీమహావిష్ణువు స్వయంగా అవతరించి పూజలను అందుకొంటూ భక్తుల కోరికలను తీరుస్తూవున్నాడని కూడా ప్రసిద్ధి వుంది కదా!

మరి ఈ ఎనిమిది దివ్య స్థలాల్లో కూడా శ్రీహరికి మిక్కిలి ఇష్టప్రదమైన పుణ్య క్షేత్రం ఏది? అది ఎక్కడుంది? ఇంకా ఆ పుణ్యభూమి యొక్క అనేకమైన విశేషాలను, విశిష్టతలను తెలుసుకోవాలని చాల ఆసక్తిగా వుంది. దయచేసి ఆ దివ్యప్రదేశం మహత్వాన్ని మాకు విపులంగా వివరించవలసిందని'' అడిగారు.

అక్కడ చేరిన మునులు అందరూ ఆతృతతో అడిగిన ప్రశ్నలకు సూతుడు చాల ఆనంద పడ్డాడు. అరమోడ్పు కన్నులతో ఒక అనిర్వచనీయమైన దివ్యానుభూతికి లోనయ్యాడు. పిదప కొద్దిసేపటికి తేరుకొన్నాడు.

''తపోధనులారా! మీరందరూ చాల చక్కని ప్రశ్నలను వేశారు. తెలుసుకోవాలనే ఆసక్తితోకూడిన నిజమైన సందేహాలను వెలిబుచ్చారు. శ్రీమహావిష్ణువు శ్రీమహావైకుంఠం తర్వాత ఈ భూలోకంలో లీలామానుష రూపంతో సంచరించడానికి ఎక్కువగా ఇష్టపడే దివ్యక్షేత్రం వేంకటాచలం. ఈ క్షేత్ర ప్రశస్తి, మహిమలు ఇప్పటివీ, ఈనాటివీ కావు. శ్వేత వరాహ కల్పం నుండీ ఆయా యుగాల్లో ఈ పుణ్య స్థలంలో శ్రీమహావిష్ణువు లీలామానుష విగ్రహుడై విహరిస్తూ వుండినాడు. ఆ దేవ దేవుడు ఈ కలియుగంలో ''వేంకటేశ్వరుడు'' అనే ప్రసిద్ధమైన పేరుతో అర్చారూపంలో స్వయంవ్యక్తుడై సాక్షాత్కరించి, దివ్య మంగళ విగ్రహ సౌందర్యంతో భక్తులకు దర్శనమిస్తూ, కోరిన వరాలను అన్నింటిని అనుగ్రహిస్తూ ''కలౌ వేంకట నాయకః'' అని ప్రఖ్యాతిని పొంది వున్నాడు.

ఈ స్థలం మాహాత్మ్యాన్నీ, శ్రీ స్వామి వారి లీలలను ఆ బ్రహ్మేంద్రాది దేవతలు, ఈశానాది దిక్పాలురు, సహస్ర ఫణాలు కలిగిన ఆదిశేషుడు మున్నగువారు సైతం సమగ్రంగా, సంపూర్ణంగా వర్ణించలేరు సరి కదా! వారందరూ కనీసం కొంతవరకైనా అర్థం చేసికొన్నారనడంకూడ సందేహాస్పదమే! మరి అలాంటిది కేవలం మానవ మాత్రుడి నయిన నేనెంతటి వాడిని? అయినప్పటికీ మా గురువరేణ్యులైన వేదవ్యాస మునీంద్రుల వారి అనిర్వచనీయమైన, అనుగ్రహంవల్ల మీరు కోరిన శ్రీవేంకటాద్రి మహిమనూ, ఆ శ్రీవేంకటేశ్వరస్వామివారి లీలలనూ, భక్తప్రియత్వాన్నీ, నిండుదయనూ, యథాశక్తిగా తెలియజేయడానికి ప్రయత్నిస్తాను.మీరు అందరూ సావధానులుగా వుంటూ అత్యంత శ్రద్ధగా, భక్తిగా ఆలకించండి.

ఈ కథను చెబుతున్న నాకూ, వింటూ వున్న మీకందరికీ సకల శ్రేయస్సులు కలగడంతోపాటు, ప్రత్యక్షంగా వేంకటాచల యాత్ర చేసిన దివ్యానుభూతి కలుగుతుంది. తద్వారా సప్తగిరీశుని సంపూర్ణమైన ఆశీస్సులను పొందుదాం'' అంటూ సూతమహర్షి ఇలా ప్రారంభించాడు.

''పూర్వం ఒకానొక సమయంలో క్షీర సముద్రంలో శేషశాయి అయిన శ్రీ మహా విష్ణువు నాభి (బొడ్డు) నుండి వింత వింత తేజస్సులతో ప్రకాశిస్తున్న ఒక సువర్ణ పద్మం ఆవిర్భవించింది. అందువల్లనే ఆ హరి 'పద్మ నాభుడు' అని పిలువబడినాడు. ఆ పద్మంలో నుండి నాలుగు ముఖాలతో బ్రహ్మ దేవుడు జన్మించాడు. విష్ణుదేవుడు ఇలాగ తనకు కుమారుడై పద్మంలో అవత రించిన చతుర్ముఖ బ్రహ్మను చూచి లోకాలన్నింటిని సృష్టిచేసే కార్యక్రమాన్ని చేపట్టవలసిందని ఆజ్ఞాపించాడు తండ్రిగారి ఆనతిపై బ్రహ్మ దేవుడు సమస్త లోకాలను సృష్టించగా, వాటిని విష్ణువు చక్కగా పోషించ సాగినాడు. ఇలా కొంతకాలం గడిచిపోయింది. కాలం ఏ ఒక్కరికోసం క్షణమైన ఆగదు కదా!

మానవకాలమానం ప్రకారం కృత, త్రేతా, ద్వాపర, కలియుగాలు నాలుగూ కలిపి ఒక సమిష్టి మహా యుగం అంటారు. ఇట్లాంటి సమిష్టి మహాయుగాలు ఒక వేయి గడచిపోగా బ్రహ్మదేవునికి ఒక అర్ధరోజు మాత్రం అనగా పగటిపూట మాత్రం గడచిపోయింది. తర్వాత అంతేకాల పరిమితి గల రాత్రి సమయం ప్రారంభ మవడంతో బ్రహ్మదేవుడు, సృష్టి కార్యక్రమంతో క్షణమైనా తీరిక లేనందువల్ల, కాస్త విశ్రాంతి తీసుకుందామనుకున్నాడు. కాని ఇంతలో బాగా అలసివున్న బ్రహ్మదేవునికి ఎక్కడలేని నిద్ర

ముంచుక వచ్చింది. అలా కునుకు పట్టడంతో ఆయన చేసిన సృష్టి కార్య క్రమం అంతా అస్తవ్యస్తమై అల్లకల్లోల మయింది. సూర్యచంద్రుల గతులు తారుమారు అయ్యాయి. మేఘాలు ఎడతెరపి లేకుండా కుంభవృష్టిని కురి పించాయి. ప్రపంచం అంతటా జలం ఆవరించి జల ప్రళయం ఏర్ప డింది. అనంతమైన ఆ ప్రళయ సాగరంలో భూగోళం పూర్తిగా మునిగి పోయింది.

అదే సమయంలో హిరణ్యాక్షు డనే రక్కసుడు భూమండలాన్ని పాతా ళానికి తీసుకొని వెళ్లి దానితో ఆడు కొంటూ, నానా బీభత్సం చేశాడు. ఇలాగ వేయి యుగాల కాలం గడచి పోగా బ్రహ్మదేవునికి మళ్లీ పగలు ప్రారం భం కావడంతో మెలకువ అయ్యింది. ఇంతలో శ్రీమహావిష్ణువు శ్వేత వరాహ రూపునిగా అవతరించి జలంలో మునిగి వున్న భూమిని ఉద్ధరిస్తూ వుండగా హిరణ్యాక్షుడు అడ్డుపడ్డాడు. శ్వేతవరాహ స్వామి వానిని సంహరించి తన కోరలతో భూమిని పైకెత్తగా దేవతలు దుందుభులు మ్రోగించారు. పూలవాన కురిపించారు.

శ్రీమహావిష్ణువు బ్రహ్మదేవుణ్ణి పిలిచి ముందువాదిరే మళ్లీ సృష్టి కార్యం కొనసాగించవలసిందని ఆజ్ఞా పించి, తది తర దేవతలనందరిని వాళ్ల వాళ్ల స్థానాలకు పంపించి వేశాడు. అనంతరం ఆదివరాహ స్వామి తన ప్రక్కనే భక్తితో నిలుచొని వున్న గరుత్మం తునితో ఇలా పలికినాడు.

''పక్షిరాజా! భూదేవిని ప్రళయా ర్ణవం నుండి ఈ వరాహ రూపంతో సముద్ధరించాను. అందువల్ల భూదేవి నన్ను పతిగా వరించింది. అందుకు నేను అంగీక రించాను కూడ. మరి వికృ త మైన ఈ రూపంతో వైకుంఠానికి వెళ్లి నట్లయితే, లక్ష్మీదేవి నన్ను చూచి భయ పడనూ వచ్చు. లేదా నవ్వనూ వచ్చు. అంతేగాక ఇక్కడే కొంతకాలం పాటు వుంటూ ఈ భూలోకాన్ని జాగ్రత్తగా పరిరక్షించ వలసిన పనివుంది. అందు వల్ల నీవు వైకుంఠానికి వెళ్లు. అక్కడ వున్న నా క్రీడా చలాన్ని తీసుకొనిరా!'' అని ఆజ్ఞాపించి, ఆ క్రీడాద్రిని స్థాపించ డానికి గాను, పావనమైన సువర్ణముఖరీ నదీ తీరం లో ఉత్తరం దిక్కున అను వుగా వుండే ఒక దివ్యస్థలాన్ని ఎంపిక చేసుకొన్నాడు.


తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

దర్శించండి! తరించండి!!

## శ్రీ కరియమాణిక్యస్వామి దేవాలయం, నగరి

తిరుపతి – తిరుత్తణి మార్గంలో తిరుపతి నుంచి 40 కి.మీ దూరంలో కుశస్థలీ నదీ తీరాన నగరి గ్రామం వెలసివుంది. ఈ దివ్యక్షేత్రంలో, శ్రీ మహావిష్ణువు భక్తుల పాలిట చింతామణిగా కోరికలు తీర్చే ప్రత్యక్షదైవంగా శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ కరియమాణిక్య స్వామిపేరుతో కొలువై దర్శనమిస్తూ మూడుపూటలా నిత్యార్చనలను అందుకొంటున్నాడు.

అత్యంత ప్రాచీనమైన ఈ ఆలయంలో, అర్థించినవారి అరచేతి మాణిక్యమైన శ్రీ కరియమాణిక్య స్వామివారికి ప్రతి శుక్రవారంనాడే కాక ప్రతి శ్రవణ నక్షత్రం రోజున, ప్రతి ఏకాదశి పర్వదినాన అభిషేకాలు, అర్చనలు, నివేదనలు ఘనంగా జరుగుతాయి.

ప్రతి సంవత్సరం రథసప్తమి పండుగనాడు శ్రీదేవి భూదేవేరులతో శ్రీ కరియమాణిక్యస్వామివారికి కల్యాణోత్సవం వైభవోపేతంగా జరుపుతారు.

తిరుమల యాత్రికులు ఈ దివ్య స్థలాన్ని కూడా దర్శించి, దివ్యానుభూతుల్ని పొందండి!

**తిరుపతి నుంచి ప్రతి 15 నిమిషాలకు నగరికి బస్సు సౌకర్యం వుంది.**

స్వామివారి ఆజ్ఞతో పక్షీంద్రుడు వైకుంఠానికి వెళ్లి లక్ష్మీదేవితో జరిగిన కథంతా విపులంగా విన్నవించి క్రీడా పర్వతాన్ని తీసుకొని వెళ్లడానికి వచ్చానన్నాడు. లక్ష్మీదేవికూడా తానూ స్వామి చెంతకు చేరాలని సంకల్పించుకొన్నది. తన మూల స్వరూపాన్ని వైకుంఠంలోనే ఉంచి ఒకే ఒక కళాంశంతో భూలోకానికి బయలు దేరింది. ఇలాగ వైకుంఠంలోని ప్రముఖ పరివారంతో శ్రీలక్ష్మీదేవితో కూడిన క్రీడాద్రితోను గరుత్మంతుడు భూలోకం చేరుకొన్నాడు. స్వామివారు సువర్ణముఖి నదికి ఉత్తర భాగంలో చూపిన పుణ్య స్థలంలో ఆ క్రీడాచలాన్ని ప్రతిష్ఠించాడు.

శ్వేతవరాహస్వామి భూదేవి సమేతంగా గరుత్మంతుడు తెచ్చి స్థాపించిన క్రీడా పర్వతాన్ని అధిరోహించి అందలి స్వామిపుష్కరిణికి పడమటి గట్టున నిలిచాడు. అంతలో బ్రహ్మేంద్రాది సర్వ దేవతలు కూడ అక్కడికి అరుదెంచి, ఆది వరాహ రూపంలో అద్భుతావహమైన ప్రకాశంతో దర్శన మిస్తూ వున్న శ్రీమహా విష్ణువు యొక్క లీలలను, వరాహ రూపంలో హిరణ్యాక్షుని సంహరించి, భూదేవిని ఉద్ధరించిన వైనాన్ని గొప్పగా కొనియాడుతూ చేతులెత్తి నమస్కరిస్తూ ఇలా ప్రార్థించారు.

''స్వామీ! ఓ అదివరాహావతారా! శ్రీహరీ! మీకు అనంతకోటి నమస్కారాలు. మీ యీ వరాహ రూపం ఆశ్చర్యంగాను, అద్భుతంగాను ఉండడమే గాక చాల భయానకంగా కూడా వుంది. మీ ఉగ్రత్వాన్ని ఉపశమింపజేసుకొని, సర్వ లోకాలలోని భక్తుల కోసం మీరు ఇక్కడే ఈ దివ్య క్షేత్రంలోనే పరమశాంత స్వరూపంతో లక్ష్మీ భూదేవులిరువురితో కలిసి ఈ శ్వేత వరాహరూపంతోనే కొలువై వుంటూ దర్శనాన్ని అనుగ్రహించి ఆనందింప జేయవలసింది. ఇంకా అనంతమైన మీ దివ్య మహిమను లీలలను సర్వత్రా చాటుతూ వుండవలసింది'' అని వినయపూర్వకంగా అభ్యర్థించారు.

దేవతల ప్రార్థనలకు సంతోషించిన ఆదివరాహస్వామి ఇలా పలికినాడు.

''హిరణ్యాక్షుని సంహరించిన నేను ఒక మహోద్దేశంతోనే ఇప్పటి నుంచి, ఇచ్చట స్థిరంగా ఉండదలంచాను. మీరు అందరూ నా సంకల్పాన్ని అనుసరించి, అట్లాగే ప్రార్థించారు. లక్ష్మీదేవిని నా వక్షః స్థలంలో నిలుపుకొని దివ్యదర్శనం ప్రసాదిస్తూ, భక్త జనుల కోరికలను తీరుస్తూ వుంటాను''.

అని అంటూ ఆ స్వామివారు సౌమ్య రూపాన్ని నవదరించి శ్రీభూదేవీ సమేతంగా స్వామిపుష్కరిణికి (కోనేటికి) పశ్చిమ తీరాన, స్వర్ణమయమై దివ్య కాంతులతో ప్రకాశిస్తూవున్న దివ్య విమానం (గోపురం) కలిగివున్న భవనంలో ప్రవేశించినాడు. అలా వైభవోపేతంగా విమాన మందిరంలో కొలువుదీరి వున్న శ్రీ వరాహ స్వామివారిని దేవతలందరు పరిపరి విధాలుగా పొగిడారు, కీర్తించారు, స్తుతించారు. అంతలో అందరూ చూస్తుండగానే ఆ దివ్య విమానం అదృశ్యం అయింది. శ్రీస్వామివారి దివ్య మహిమలకు ఆశ్చర్యపడుతూ బ్రహ్మాది దేవతలు అంతా స్వామివారి విమానం అదృశ్యమైన వైపుగా ఆసక్తిగా, కళ్లు నిగిడించి చూస్తూ అనేక విధాలుగా స్తోత్రాలు చేస్తూ వారి వారి లోకాలకు వెళ్లిపోయారు. అనంతరం వరాహ స్వామి, లక్ష్మీదేవితో ఇలా అన్నాడు.

''లక్ష్మీ! నీవు నా వికార స్వరూపాన్ని చూచి భయపడతావని తలంచి నేను వైకుంఠానికి రాలేదు. అయినా నీవే సపరివారంగా నాదగ్గరకు వచ్చినావు నాకు చాలా ఆనంద మయింది.''

అప్పుడు లక్ష్మీదేవి--

''స్వామీ! మీరు ఎక్కడుంటే అక్కడే నేను. మీ తోడిదే నా లోకం. మిమ్మల్ని విడిచి ఒక్క క్షణమైనా వుండగలనా! అందువల్ల అందరితో పాటుగా నేనూ కదలి వచ్చాను. నన్ను మన్నించ గోరుతున్నాను''అని వేడుకొన్నది.

''దేవీ! దానవ స్వభావంతో ప్రవర్తిస్తున్న దుష్టులనుండి సత్పురుషులను సంరక్షించడానికే నేను ఈ భూమి మీద నిలిచాను. వైకుంఠం కంటే కూడ ఇక్కడే చాల బాగా ఉంది''అని అంటూ స్వామి, ఆదిలక్ష్మిని ఆలింగనం చేసికొని తన వక్షః స్థలంలో నిలుపు కొన్నాడు.

ఆనాటి నుండి శ్రీ, భూదేవీ సమేతుడైన శ్వేతవరాహ స్వామివారు వలసినపుడు భక్తులకు సౌమ్య రూపంలో దర్శనమిస్తూ, మిగిలిన సమయాల్లో లీలామానుష రూప

ధారియై ఆ క్రీడా చలంలో విహారం చేస్తూ వుండినాడని సూతమహర్షి వివరించి చెబుతూ వుండగా, శౌనకాది మహర్షులు మళ్లీ తమకు కలిగిన సందేహాలను ఇలా వెలి బుచ్చారు.

''మునీంద్రా! శ్రీహరి క్రీడాద్రిపై 'స్వామి పుష్కరిణి'కి పశ్చిమతీరాన వున్న దివ్య విమాన మందిరంలో వెలసినాడని చెప్పారు కదా! ఆ స్వామి అక్కడే ఎందుకు నిలిచాడు. అందులకు ప్రత్యేకమైన కారణం ఏమైనా ఉందా? ఆ పుష్కరిణిని ''స్వామి పుష్కరిణి'' అని అన్నారు. ఎందుకు ఆ పేరుతో పిలిచారు? ఆ పుష్కరిణి యొుక్క మహిమలు ఎలాంటివి? వాటిని మాకు వివరంగా తెలియజేయవలసింది'' అంటూ ప్రార్థించారు.

అందులకు సూతుడు 'సరే' నన్నట్టుగా తలను ఊపుతూ ఇలా ప్రారంభించాడు.

## స్వామి పుష్కరిణి

శ్రీ వైకుంఠంలోని క్రీడాచలం మీద వున్న ''క్రీడావాపి'' నే ''స్వామి పుష్కరిణి'' అంటారు. శ్రీమహావిష్ణువు ఆనతి మేరకు గరుత్మంతుడు క్రీడాద్రితో పాటు క్రీడా వాపిని కూడా తెచ్చి ఇక్కడ స్థాపించారు.

శ్రీదేవి భూదేవులతో కలిసి వైకుంఠనాథుడైన శ్రీమహావిష్ణువు ఈ పుష్కరిణిలో జలక్రీడలాడినందువల్ల ఇది విరజానదివలె పరమ పవిత్రమై వెలుగొందుతూ వుంది. అంతేగాక గంగాదినదులకన్నా అత్యంత మహిమ కలదిగా ప్రసిద్ధి పొందింది. లోకంలోని సమస్త పాపాలను పోగొట్టే ప్రభావంగల పరమపుణ్యమైన తీర్థం ఈ పుష్కరిణి! ఈ కోనేటిని దర్శించినా, సేవించినా స్మరించినా సమస్త సిద్ధులు కరతలా మలక మవుతాయి.

స్వామి పుష్కరిణీ స్నానం
సద్గురోః పాద సేవనమ్
ఏకాదశీవ్రతం చాపి
త్రయ మత్యంత దుర్లభమ్.

దుర్లభం మానుషం జన్మ
దుర్లభం తత్ర జీవనమ్
స్వామిపుష్కరిణీ స్నానం
తత్ర మత్యంత దుర్లభమ్.

''స్వామి పుష్కరిణీ స్నానం, సద్గురు పాదసేవనం, ఏకాదశివ్రతం ఈ మూడు కార్యక్రమాలు లభ్యంకావడం అత్యంత దుర్లభాలు. అలాగే మానవునిగా జన్మించడం, మానవునిగా మనుగడ సాగించడం, ఆ మానవ జీవితంలో స్వామి పుష్కరిణిలో స్నానం చెయ్యడం – అనే కార్యాలు కూడడం కూడా చాల దుర్లభాలు'' అని వరాహ పురాణం చాటుతోంది.

వేంకటాద్రిపై వెలసివున్న ఈ కోనేరు అనంతమైన మహిమలతో విరాజిల్లుతూ, ప్రపంచంలోని తీర్థాలన్నింటికీ ''స్వామి'' వలె అనగా ప్రభువువలె అగ్రగణ్యమై వున్నందువల్ల ''స్వామి పుష్కరిణి'' అని ప్రసిద్ధి కెక్కి సార్థక నామధేయాన్ని పొందింది.

ధనుర్మాసే సితే పక్షే
ద్వాదశ్యా మరుణోదయే
ఆయాన్తి సర్వతీర్థాని
స్వామి పుష్కరిణీ జలే.
తత్ర స్నానం ప్రకుర్వంతి
యే నరాః ప్రీత మానసాః
తే సర్వ పాప ర్ముచ్యంతే
సగోత్ర జ్ఞాతి బాంధవాః.

ఇంతటి పరమపావని అయిన ఈ పుష్కరిణిలో ప్రతి సంవత్సరం వైకుంఠద్వాదశినాటి అరుణోదయ వేళలో ముల్లోకాలలోని సమస్త తీర్థాలు వచ్చి చేరతాయట! అందుకే ఆ రోజు ''స్వామిపుష్కరిణీ తీర్థముక్కోటి' గా చెప్పబడుతున్నది. ఇలాగ ధనుర్మాసంలో శుక్లపక్షద్వాదశినాడు అరుణోదయ వేళలో ఎవరైతే మనఃప్రీతితో స్నానం చేస్తారో వారు, వారి సగోత్రికులైన దాయాదులు, బంధువులు అందరూ అన్ని పాపాల నుండి విముక్తులవుతారు.

ఈ స్వామి పుష్కరిణీ ప్రభావం ఎనలేనిది. అయినా ఈ తీర్థ మహిమను చాటే రెండు మూడు గాథలను ఈ సమయంలో మనం తప్పక తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా వున్నది. వాటిని గురించి జాగ్రత్తగా వినండి మరి'' అంటూ సూత మహర్షి ఇలా కొనసాగించాడు.

(వచ్చే సంచికలో ''శ్రీస్వామి పుష్కరిణి మహిమ'' ను తెలుసు కుందాం.)